

జనరిక్..సేల్స్‌లో పీక్
ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారం కారణంగా జనరిక్ మందుల వాడకం బాగా పెరిగింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో, ప్రైవేట్‌గానూ జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. -IIలో..



కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం
హజ్రత్ ఆయిషా బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి తన సహకారం ఉంటుందని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. -IIలో..

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 33.2/18.2
జిల్లాలో శుక్రవారం 18.2 - 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

స్పందన తాత్కాలికంగా రద్దు

కడప సిటీ: శాసనమండలి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈనెల 13వ తేదీ సోమవారం స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారుడు ఈ విషయాన్ని గమనించాలన్నారు. వ్యయ ప్రయాసలు కోర్చి ప్రజలు కలెక్టరేట్‌కు రావద్దని ఆయన సూచించారు.

13 వరకు మద్యం దుకాణాలు మూసివేత

కడప వైఎస్ఆర్ సర్కిల్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం నుంచి 13వ తేదీ వరకు మద్యం దుకాణాలు, బార్లను మూసి వేస్తున్నట్లు కడప ఏపీఎస్‌బీసీఎల్ మేనేజర్ మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాతృ మరణాలకు అడ్డుకట్ట వేయాలి

కడప రూరల్ : మాతృ మరణాలకు అడ్డుకట్ట వేసేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఫిబ్రవరి నెలలో కడప నగరం ఎన్జీఓ కాలనీలో జరిగిన సయ్యద్ హలీమా మాతృ మరణంపై శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని చాంబర్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సయ్యద్ హలీమా ఆరోగ్య పరిస్థితులు, ఆమెకు అందిన వైద్య సేవలపై వైద్య బృందంతో సమీక్షించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితుల్లోనూ మాతృ మరణాలు సంభవించకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. తల్లీబిడ్డకు సమస్య ఉంటేనే సిజేరియన్ చేయాలన్నారు. వీలైనంత వరకు నార్మల్ డెలివరీ చేసేందుకు ప్రాముఖ్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేశ్వర్‌కుమార్, రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి, వైద్యులు రాణి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వాసవాంబకు ముత్యాల చీర సమర్పణ



ముత్యాల చీరలో శ్రీ వాసవాంబ

కడప కల్చరల్: కడప నగరంలోని శ్రీ వాసవీ కన్యకాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఉత్సవమూర్తితోపాటు మూలవర్లకు భక్తులు ముత్యాల చీరలను సమర్పించారు. ఆర్యవైశ్య మహిళా మండలి 200 సంవత్సరాల నాటి అమ్మవారిశాలకు అనుబంధంగా ఏర్పడి 50 సంవత్సరాలైన సందర్భాన్ని పురస్కరించుకుని వినూత్నమైన సేవలు నిర్వహించాలని మండలి సభ్యులు తలచారు. ఇందులో భాగంగా మహిళా మండలి సభ్యులు అమ్మవారికి ఆకర్షణీయమైన, కనువిందైన డిజైన్‌లో ముత్యాల చీరలను తయారు చేసి సమర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల వస్త్రాలను పూజలో ఉంచి అమ్మవారికి అలంకరింపజేశారు. మండలి సభ్యులందరూ ఎర్రటి వస్త్రాలను ధరించి పూజల్లో పాల్గొన్నారు. లలిత సహస్ర నామాన్ని తొమ్మిదిసార్లు పఠించారు. అనంతరం భక్తులు, ప్రజలకు అన్నదానం చేశారు. 150 మందికి పైగా వాసవీ మహిళా మండలి సభ్యులు దాదాపు రూ. 2.50 లక్షలు వెచ్చించి ఈ చీరలను అందజేశారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు తేజోవతమ్మ, కార్యదర్శి ముల్లంగి ప్రసన్న, కోశాధికారి సువర్ణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య.. ఉజ్వాల భవిత

- పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు..పాలిసెట్
- పది విద్యార్థులకు చక్కని అవకాశం
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం



ఎలక్ట్రికల్ ల్యాబ్‌లో ప్రాక్టికల్ చేస్తున్న మహిళా విద్యార్థులు



కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

కడప ఎడ్యుకేషన్: పదోతరగతితోనే ఉన్నత సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ప్రవేశాలు పొందొచ్చు. ఈ ఏడాది పదిపరీక్షలు ప్రారంభం కాకుండానే సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు ముందుగానే నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం...
గ్రామీణ పేద విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక విద్య అభ్యసించడం ఖర్చుతో కూడుకుంది. వీరికి తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య అందిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలిసెట్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి సాంకేతిక విజ్ఞానాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందవచ్చు.

కోర్సుల వివరాలు ఇలా...
ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఈఈఈ, కంప్యూటర్ మెకానిక్, ఈసీఈ, ఎంఈసీ తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. పలుచోట్లు ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచికి 30 నుంచి 120 వరకు సీట్లు ఉంటాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రవేట్ కలిసి 21 పాలిటెక్నిక్ కళాశాలకుగాను 5097 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

జిల్లాలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు: 09
ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు: 12
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులోని ఉన్న సీట్లు: 2181
ప్రవేటు పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులోని సీట్లు: 5097

ప్రవేశ పరీక్ష
పాలిసెట్ పరీక్ష రాసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఈ పరీక్ష 120 మార్కులకు నిర్వహిస్తారు. దరఖాస్తు చేసేకునేందుకు ఏప్రిల్ 30వ తేదీ వరకు గడువు ఉంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కుల చొప్పున ఈ ప్రవేశ పరీక్ష ఉంటుంది. మే 10న పాలిసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు.మే 25న ఫలితాలు వెల్లడిస్తారు ఎంట్రెన్స్ రాసేందుకు ఓసీ, బీసీ వర్గాల విద్యార్థులు రూ. 400, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు రూ. 100 చొప్పున ఫీజు చెల్లించాలి. తగిన ధ్రువీకరణ పత్రాలతో https://poly cetap.nic.in/ అనే వెబ్‌సైట్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఎన్నో ప్రయోజనాలు...
పాటిటెక్నిక్‌లో ఏ కోర్సు పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతాయి. పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇటీవల ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి మూడు సంవత్సరాలకు తక్కువ ఖర్చుతో కోర్సును పూర్తి చేయవచ్చు. తర్వాత ఇంజినీరింగ్‌లో సెకండియర్‌లో చేరవచ్చు.లేకపోతే ఉద్యోగప్రయత్నాలు చేసుకుని ఉద్యోగంలో చేరవచ్చు.

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
ప్రవేశ పరీక్ష : మే 10
ఫలితాలు వెల్లడి: మే 25
కౌన్సెలింగ్ : జూన్ 4వ వారం

తక్కువ సమయంలో...



పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ చేస్తే చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతోపాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 17వ తేదీ నుంచి విద్యార్థులకు ఉచితంగా కోచింగ్‌ను నిర్వహించనున్నాం. మెటీరియల్‌ను అందచేస్తాం. అలాగే వీరికి ప్రతి రోజు పరీక్ష నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేస్తాం.
- సీహెచ్ జ్యోతి, కో-ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కడప

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వి.విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం మండల విద్యాశాఖాధికారులు, రెవెన్యూ, పోలీసు, మెడికల్, రవాణా శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 28,380 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారని కలెక్టర్ తెలిపారు. పరీక్షలు ఏప్రిల్ 3వ తేది నుంచి 18వ తేది వరకు 146 కేంద్రాల్లో జరగనున్నాయని తెలిపారు. ఈ ఏడాది విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నాపత్రంలో ఏడు అంకెలతో కూడిన సీరియల్ నంబరును ముద్రించి ఇవ్వనున్నట్లు చెప్పారు. దీంతో ఆ ప్రశ్నాపత్రం ఏ పరీక్షా కేంద్రానికి ఇవ్వడం జరిగింది? ఏ విద్యార్థికి ఇచ్చారనేది తెలుస్తుందన్నారు. డిపార్టుమెంటల్ ఎగ్జామినేషన్ ఇన్విజిలేటర్లు ఏ ఒక్కరికీ కూడా పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు, సమగ్ర శిక్ష పీడీ ప్రభాకర్‌రెడ్డి, అన్ని మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

11 రకాల గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయొచ్చు

కడప సిటీ : శాసనమండలి ఎన్నికల్లో ఓటరు గుర్తింపు కార్డు లేని వారు భారత ఎన్నికల సంఘం ఆమోదించిన 11 రకాల ఫోటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక దానిని చూపించి ఓటుహక్కు వినియోగించుకోవచ్చని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఫోటో ధ్రువీకరణ పత్రాలు: భారతీయ పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఉద్యోగులకు జారీ చేసిన ఫోటోగల సర్వీసు గుర్తింపుకార్డులు, బ్యాంకులు, పోస్టాఫీసులు జారీ చేసిన ఫోటోగల పాసు పుస్తకాలు, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌బీఐచే జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఉపాధిహామి జాబ్‌కార్డు, కార్మిక మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు, ఫోటోగల పింఛన్ పత్రం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, ఆధార్‌కార్డు ఉపయోగించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 32 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.

ఓటుహక్కు వినియోగానికి అవకాశం ఇవ్వండి: జిల్లాలో అన్ని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, ఇతర సంస్థలు, అన్ని ప్రైవేటు యాజమాన్యాలు, అథారిటీలు ఓటర్లుగా నమోదైన ఉద్యోగులు,కార్మికులకు ఓటు వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

సైలెంట్ పీరియడ్‌లో ముందస్తు అనుమతులు తప్పనిసరి
కడప సిటీ : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల సైలెంట్ పీరియడ్ అంటే పోలింగ్ ముందస్తురోజు, పోలింగ్‌రోజు (పత్రికల్లో ప్రచురించే రోజు) పత్రికల్లోగానీ, ఎలక్ట్రానిక్ మీడియాలోగానీ, సోషల్ మీడియాలోగానీ ప్రకటనలు ఇవ్వదలిచిన వారు ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సంబంధించిన ప్రకటన, దరఖాస్తుపై పోటీ చేసే అభ్యర్థి సంతకం చేసి కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ కమిటీకి సమర్పించి ఆ కమిటీతో ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిధిలో 12, 13 తేదీల్లో స్థానిక సెలవు
ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు ఈనెల 12, 13 తేదీల్లో స్థానిక సెలవు దినాలుగా ప్రకటించినట్లు కలెక్టర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయని సంస్థలు, కార్యాలయాలు యదావిధిగా జరుగుతాయని, వీటికి స్థానిక సెలవులు వర్తించవని తెలిపారు.

పోలింగ్ ప్రక్రియ అత్యంత కీలకం

- ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి




మాట్లాడుతున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప సిటీ : శాసనమండలి ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియ అత్యంత కీలకమైనదని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు నియమించిన 400 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మూడు సెషన్లలో ఆర్డీఓ అధ్యక్షతన ఒకరోజు డెమో బ్యాలెట్ బాక్సులు, పత్రాలు, పీపీటీ ద్వారా శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 13వ తేదిన ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 38 ఎమ్మెల్సీ టీచర్స్ పోలింగ్ కేంద్రాలు, 93 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను సజావుగా జరిపేందుకు కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డెమో బ్యాలెట్ బాక్సులు, డెమో బ్యాలెట్ పేపర్లను అధికారులకు చూపిస్తూ వాటి నిర్వహణ ఎలా చేపట్టాలన్న అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష పీడీ ప్రభాకర్‌రెడ్డి, బద్వేలు ఆర్డీఓ వెంకట రమణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

- ఏపీఎస్ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రమాదాల నివారణకు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండటంతో పాటు, జాగ్రత్తలు పాటించాలని ఏపీఎస్ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి గోపాల్‌రెడ్డి సూచించారు. కడప రీజియన్ పరిధిలో తక్కువ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు శుక్రవారం కడపలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండు ప్రాంతాల్లో వేగంగా బస్సులు నడపకూడదని, హారన్ మోత లేకుండా చూడాలని, కండక్టర్ లేకుండా రివర్స్ చేయకూడదని సూచించారు. కడప డిపో మేనేజర్ ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ అనవసరమైన ఓవర్‌టేక్‌లు సరికాదన్నారు. ఇంధనం పొదుపు చేసేందుకు పంచసూత్రాలను వివరించారు. కేఎంపీఎల్ పెరుగుదలకు ప్రతి డ్రైవర్ శక్తిమేర కృషిచేయాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌డీఐలు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

వండిపెట్టాలా..సరుకులు ఇంటికివ్వాలా!

- గర్భిణులు, బాలింతల మనోగతంపై సర్వే
- అంగన్వాడీ కేంద్రాల్లో పారదర్శకంగా సమాచార సేకరణ



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు, గర్భిణులు(ఫైల్)

కడప కోటిరెడ్డి సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. శిశు మరణాల రేటును తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టింది. అయితే గర్భిణుల హాజరు శాతం తగ్గిపోతుండటంతో కారణాలు అన్వేషించే పనిలో పడ్డారు. జిల్లాలో 2389 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వాటి పరిధిలో గర్భిణులు 17660మంది, బాలింతలు 17318మంది, చిన్నారులు1,22,037 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నం వండి వడ్డించాలా? లేక సరుకులే ఇంటికి ఇవ్వాలా? అనే అంశంపై క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టారు. ఈ సర్వేను అధికార యంత్రాంగం పారదర్శకంగా, దిగ్విజయంగా పూర్తి చేసింది. ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం వండి వేడివేడిగా వడ్డించేవారు. అయితే కరోనా మహమ్మారి ఈ పరిస్థితిని దూరం చేసింది. తల్లులు, పిల్లలకు డ్రై రేషన్‌ను ఇంటికి అందించే వారు. ప్రస్తుతం మళ్లీ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం అందించేందుకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇక్కడే వండి ఇంటికి తీసుకెళ్లి తినమన్నా స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో బాలింతలు, గర్భిణులకు ఏ విధంగా అందించాలన్న విషయమై సర్వేకు శ్రీకారం చుట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాలుగు అంశాలతో కూడిన సర్వేను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే కార్యక్రమం పూర్తి చేశారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల పిల్లలు అనేక లోపాలతో పుడుతున్నారని సర్వేలు తెలియజేస్తున్నాయి. గతంలో బియ్యం, నూనె, పప్పు, పాలు, గుడ్లు నెల నెలా ఇంటికి అందించేవారు. అవి సక్రమంగా వినియోగించుకోవడం లేదని, కేంద్రాల్లోనే వండిపెట్టాలన్న నిబంధన పెట్టారు. అయితే లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. మరోవైపు నెలలు నిండిన గర్భిణులు కేంద్రాలకు నడిచి రావడం ఇబ్బందిగా మారడంతో.. బాక్సుల్లో భోజనం ఇంటికి తీసుకు వెళ్లవచ్చని ఆదేశాలు జారీ చేశారు. అయితే హాజరు శాతం అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది.

సర్వే వివరాలు ఇలా: గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం తింటారా? బాక్సులో పెట్టుకుని ఇంటికి తీసుకు వెళతారా? లేక రేషన్ సరుకులు ఇంటికి ఇస్తే బాగుంటుందా? తదితర అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండు వారాలుగా సర్వే నిర్వహించారు. ఈ వివరాలు లబ్ధిదారుల ద్వారా తెలుసుకుని కార్యకర్తలు వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచే కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

పక్కాగా సర్వే నిర్వహించాం



గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం చేస్తేనే మంచిదన్న విషయాన్ని అవగాహన కల్పించాం. చాలా మంది కేంద్రాలకు రావడానికి ఇష్టపడటం లేదు. దీనిపై ప్రభుత్వం ఆదేశాల మేరకు లబ్ధిదారుల నుంచి లిఖిత పూర్వకంగా తీసుకున్న వివరాలను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో పొందుపరిచాం. సర్వే పక్కాగా పూర్తి చేశాం. - ఎంఎస్ రాణి, ఐసీడీఎస్ పీడీ, కడప

రిమ్స్‌లో గుర్తు తెలియని యువకుడి మృతి



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఈనెల 8వ తేదీన గుర్తు తెలియని యువకుడు (25) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. యువకుని సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు కోరారు.

మైదుకూరులో చోరీకి యత్నం



దుండగులు పగులగొట్టిన ఇంటి ప్రధాన తలుపు

మైదుకూరు : మైదుకూరులోని కడప రోడ్డులో గురువారం రాత్రి ఓ ఇంటి తలుపులను దొంగలు పగులగొట్టి చోరీకి ప్రయత్నించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో టి.నరసింహారెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన భార్య మోకాలి ఆపరేషన్ చేయించుకుని హైదరాబాద్‌లో ఉంటున్నారు. పది రోజుల క్రితం నరసింహారెడ్డి భార్యను తీసుకొచ్చేందుకు వెళ్లారు. ఇంటి ముందు రోజు శుభ్రం చేసే పనిమనిషి శుక్రవారం ఉదయం వచ్చి చూడగా ఇంటి ప్రధాన తలుపు తెరిచి ఉంది. వెంటనే ఆమె నరసింహారెడ్డికి సమాచారం అందించింది. అప్పటికే బస్సు మైదుకూరు సమీపంలోకి వచ్చి ఉండటంతో కొద్ది సేపటికే నరసింహారెడ్డి దంపతులు ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తలుపు బద్దలై ఉంది. దుండగులు రెండు గదుల్లో వెతికి వెళ్లిపోయారు. ఇంటిలోని వస్తువులేమీ ఎత్తుకెళ్లలేదని బాధితుడు తెలిపారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప నుంచి క్లూస్ టీం సభ్యులు వచ్చి వేలి ముద్రలను సేకరించారు.

జనరిక్.. సేల్స్‌లో పీక్

- పెరుగుతున్న వాడకం
- 40నుంచి 70 శాతం తక్కువ ధరకు మందులు
- పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం



జిల్లా ఆస్పత్రి ఆవరణలోని జనరిక్ మెడికల్ షాపు

ప్రొద్దుటూరు క్రైం : ఏదైనా ఒక వస్తువు తక్కువ ధరకు వస్తుందంటే జనం వాటిని కొనడానికి క్యూ కడతారు. మళ్లీ ఆ వస్తువు ఇంత తక్కువకు దొరుకుతుందో లేదోనని అవసరానికి మించి కొనుగోలు చేస్తారు. అయితే ప్రాణాలను నిలిపే ఔషధాల విషయంలో ప్రజల ఆలోచన ఇందుకు భిన్నంగా ఉంది. తక్కువ ధరకు లభిస్తున్న మందులంటే అవి పని చేస్తాయో లేదో అనుమానం అనేకమందిలో ఉంది. ఇలా తక్కువ ధరలకు లభిస్తున్న జనరిక్ మందుల విషయంలో కొన్నేళ్ల క్రితం వరకు ప్రజల్లో అపోహ ఉండేది. అయితే ఇప్పుడు ప్రజల ఆలోచనల్లోనూ మార్పు వచ్చినట్లు కనిపిస్తుంది. ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారం కారణంగా జనరిక్ మందుల వాడకం బాగా పెరిగింది. ప్రస్తుతం ఆస్పత్రి బిల్లు కంటే మందుల ఖర్చు ఎక్కువ అవుతోంది. దీంతో జ్వరం, జబులు చేసినా పేద, మధ్య తరగతి ప్రజలు వణికిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జనరిక్ మందులు కొంత వరకు ఉపశమనం కలిగిస్తున్నాయి.

పెరిగిన జనరిక్ మందుల షాపులు

గతంతో పోలిస్తే జనరిక్ మెడికల్ షాపుల సంఖ్య జిల్లాలో పెరిగినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో, ప్రైవేట్‌గానూ జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 25 జనరిక్ షాపులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కడప రిమ్స్‌లో, ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో ప్రభుత్వ సహకారంతో జనరిక్ దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇంకా ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు, కడప, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో ఈ షాపులు ఉన్నాయి.

సాధారణ మందుల్లాగే పని చేస్తాయి

ధర తక్కువగా ఉండే మందుల మందుల విషయంలో ప్రజలకు అపోహ మరింత ఎక్కువగా ఉంటుంది. అనేక పరిశోధనలు చేస్తే గానీ ఒక మందు మార్కెట్‌లోకి రాదు. ఇందుకోసం ఫార్మా కంపెనీలు రూ. కోట్లలో ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఇందుకు ప్రతిఫలంగా సదరు ఫార్మా కంపెనీకి ఆ మందుపై సుమారు 20 ఏళ్లపాటు పేటెంట్ హక్కులు ఉంటాయి. ఈ విధంగా తయారు చేసిన మందును బ్రాండెడ్ డ్రగ్స్ లేదా స్టాండర్డ్ డ్రగ్స్ అని పిలుస్తారు. ఇతర ఫార్మా కంపెనీలు పేటెంట్ పొందిన కంపెనీ ఫార్ములాను ఉపయోగించి మందులను తయారు చేయడాన్ని తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఆ మందుపై మొదట తయారు చేసిన కంపెనీకే 20 ఏళ్ల పాటు సర్వహక్కులు ఉంటాయి. 20 ఏళ్ల తర్వాత ఇతర కంపెనీలు అదే ఫార్ములాను ఉపయోగించి తయారు చేసిన వాటిని జనరిక్ మందులు అంటారు. ఈ మందులు తయారు చేయడానికి పరిశోధనలు అవసరం ఉండదు. కాబట్టి ఇలాంటి మందులపై మార్కెటింగ్ ఖర్చులు, జీతభత్యాలు, ప్యాకేజీలు, కమీషన్ తదితర ఖర్చులేమీ ఉండవు. అందువల్ల అతి తక్కువ ధరకు విక్రయించడానికి సాధ్యం అవుతుంది. వీటిపై ముద్రించే ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు లభిస్తాయి. తక్కువకు విక్రయిస్తున్నందున నకిలీ మందులనీ, అవి సరిగా పని చేయవని భయపడాల్సిన పని లేదు. బ్రాండెడ్ మందులు తయారీలో పాటిస్తున్న ప్రమాణాలన్నీ జనరిక్ మందుల్లోనూ పాటిస్తారు. కాబట్టి ఈ మందులను నిరభ్యంతరంగా వాడొచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు జనరిక్ మందులకు అలవాటు పడితే ఫార్మా కంపెనీలకు, మెడికల్ షాపులకు నష్టం వస్తుంది. దీంతో బ్రాండెడ్ మందుల్లా జనరిక్ మెడిషన్స్ పని చేయవని కొందరు పనిగట్టుకొని కొందరు వైద్యులు ప్రచారం చేస్తున్నారు.

తక్కువ ధరకు ప్రధాన కంపెనీల మందులు

జనరిక్ షాపుల్లో తక్కువ ధరకే మార్కెట్లో పలు ప్రధాన కంపెనీల మందులను విక్రయిస్తున్నారు. లుపిన్, సిప్లా, ర్యాన్‌బాక్సీ, అల్కెమ్, గ్లెన్‌మార్క్, క్యాడిలా, ఇన్‌టాస్, లీఫార్డ్, బయోకెమ్ తదితర ప్రధాన కంపెనీలకు చెందిన ఔషధాలను అతి తక్కువ రేటుకు అభిస్తున్నాయి. షుగర్, బీపీ, గుండె జబ్బులు, థైరాయిడ్, ఆస్తమా తదితర దీర్ఘకాలిక వ్యాధులు, గ్యాస్ట్రబుల్, జ్వరం, తలనొప్పి మందులను జనరిక్ మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నారు. కంపెనీకి చెందిన అజిత్రోమైసిన్ 500ఎంజీ రూ.70కి విక్రయించగా జనరిక్ మెడికల్ షాపులో రూ.50 కే లభిస్తుంది. అలాగే మార్బిలుకాస్ట్ టాబ్లెట్‌ల షీట్ రూ. 132 ఉండగా జనరిక్‌లో 35,రూ. కాల్షియం డీ3 ఎమ్మార్పీ రూ.100 ఉండగా రూ. 30కి, అమ్లోడిపైన్ అనే బీపీ మాత్రల ఎమ్మార్పీ రూ.56 ఉంటే రూ. 10కి, పారాసిటమాల్ ఎమ్మార్పీ రూ.30 ఉండగా రూ.20కి, మెట్‌ఫార్మిన్ గ్లైమ్‌ప్రైడ్ మాత్రల ఎమ్మార్పీ రూ. 95 ఉండగా రూ.15కు, పాంటాప్రాజోల్ మాత్రల షీట్ రూ. 118 కాగా రూ. 30కే జనరిక్ మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు చెందకుండా జనరిక్ మందులను వాడొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

నిరభ్యంతరంగా వాడొచ్చు



జనరిక్ మందులపై అపోహలు పెట్టుకోవద్దు. బ్రాండెడ్ కంపెనీ మందుల్లాగే ఇవి కూడా బాగా పని చేస్తాయి. అన్ని వ్యాధులకు జనరిక్‌లో ఔషధాలు లభిస్తున్నాయి. పేదలు, మధ్య తరగతి ప్రజలకు ఇవి అధిక ధరల భారాన్ని తగ్గిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో జనరిక్ మందుల వాడకం ఎక్కువగా ఉంది. మన ప్రభుత్వం కూడా జనరిక్ మందులను ప్రోత్సహిస్తోంది.

– డాక్టర్ ఆనంద్‌బాబు, మెడికల్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి.

జనరిక్ మందులనే వాడుతున్నా



నేను 2015 నుంచి జనరిక్ మందులనే వాడుతున్నా. ఇవి బాగా పని చేస్తున్నాయి. బ్రాండెడ్ మందులు ఎలా పని చేస్తాయో ఇవి కూడా అలానే మన ఆరోగ్యాన్ని కాపాడతాయి. అపోహలు వీడి పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు అందరూ వీటిని కొనుగోలు చేయవచ్చు. – కృపాకర్, యర్రగుంట్ల.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శ్రీరాములు (ఫైల్)

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారిలో స్థానిక ఓ డాబా సమీపంలో వెనుకవైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొని శ్రీరాములు అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ చంద్రమోహన్ సమాచారం మేరకు ముద్దనూరుకు చెందిన శ్రీరాములు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి భోజనానికి అతను నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా తాడిపత్రి వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం అతన్ని వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు పక్కన పడి ఇతను చనిపోవడంతో రాత్రి అంతా ఎవరూ గుర్తించలేదు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెట్టుపైనుంచి పడి..



మృతుడు కమాల్ సాబ్

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్రముక్కపల్లి నుంచి ఎస్వీడిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలో న్యాయవాది శివప్రసాద్ రెడ్డికి సంబంధించిన స్థలంలో వేప చెట్లను నరుకుతుండగా గౌసనగర్‌కు చెందిన కమాల్‌సాబ్ (49) కిందపడి మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు కమాల్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా.. కమాల్‌సాబ్ శుక్రవారం ఉదయం న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి ఇంటి స్థలంలో వేపచెట్లను నరికేందుకు కూలిపనికి వెళ్లాడు. ఆ చెట్టును నరుకుతుండగా కాలుజారి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతన్ని రిమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు తెలిపారు.

వివాహితను మోసం చేసిన వారిపై కేసు

కడప అర్బన్ : కడప నగరంలోని విజయదుర్గా కాలనీలో నివాసం ఉంటున్న సల్మా అనే యువతిని మోసం చేసిన కేసులో 8 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఊటుకూరుకు చెందిన నజీమ్ అనే యువకుడు 2019లో సల్మాను వివాహం చేసుకున్నాడు. ఇటీవల ఆమె మూడునెలల గర్భిణి. ఈ క్రమంలో ఆమెను మోసం చేసి, మరో యువతిని వివాహం చేసుకున్నాడు. ఇందుకు సహకరించిన నజీమ్ తల్లిదండ్రులు, బంధువులు మొత్తం 8మందిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలిపారు.

బహిరంగ వేలము ప్రకటన

శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టరు, వై యస్ ఆర్ జిల్లా వారి ఉత్తర్వుల నెం. Rc. No. 1(2)/94/2023, తేది: 22.02.2023 ప్రభుత్వము వద్ద నిల్వ ఉన్న సుమారు 1600 మెట్రిక్ టన్నుల సీజ్ చేయబడిన బియ్యమునకు సంబంధించి బహిరంగ వేలము వేయుటకు నిర్దేశించిన ప్రకారము ఈ క్రింద తెలుపబడిన మండల స్థాయి గోదాముల నందు గల బియ్యము వివరములు ప్రకారము బహిరంగ వేలము జరిపించుటకు గాను.

సీజ్ చేయబడిన బియ్యం (Raw Rice) నిల్వ ఉన్న మండల స్టాక్ పాయింట్లు :-

1) కడప 2) చెన్నూరు 3) కమలాపురం 4) యర్రగుంట్ల 5) ఒంటిమిట్ట 6) బద్వేలు 7) పోరుమామిళ్ల 8) మైదుకూరు 9) ప్రొద్దుటూరు 10) జమ్మలమడుగు 11) ముద్దనూరు 12) పులివెందుల 13) వేంపల్లి.

నిబంధనలు: 1) బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా ధరావత్తు రూ.1,00,000/-లు డి.డి. రూపంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, కడప వారి పేరున చెల్లించి తేది : 17.03.2023 సాయంత్రం 5 గంటల లోపు అప్లికేషన్ పొందవలెను. 2) కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటు వారి లైసెన్స్ ఉన్న ట్రేడర్ / రైస్ మిల్లర్ అయి ఉండవలెను. 3) వేలము ముగిసిన అనంతరము వేలం కోసం చెల్లించిన ధరావత్తు సైకమునకు సంబంధించిన రసీదు తీసుకొని Unsuccessful Bidder కు డి.డి. తిరిగి ఇవ్వబడును. 4) బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారు వేలం ముగిసిన 5 దినములలో మొత్తం సైకం చెల్లించి, సైకం చెల్లించిన 10 దినములలో సరుకును స్వాధీన పరుచుకోవలెను మరియు స్వాధీన పరుచుకున్న పది 10 దినములలో ఆ సరుకును ఉపయోగించుకోవలెను. 5) పీడీఎస్ బియ్యాన్ని మళ్లించడం లేదా స్టాకును దుర్వినియోగం చేయడాన్ని నిరోధించడానికి బహిరంగ వేలంలో పొందిన బియ్యం యొక్క తార్కిక ముగింపు వరకు స్టాకు ఉపయోగమును మరియు కదలికల విధానాన్ని జిల్లా కలెక్టర్ / జిల్లా సంయుక్త కలెక్టరు వారు గమనిస్తూ ఉంటారు 6) వేలము వేయు సరుకును కార్యాలయ పనిదినములలో వేలము జరుపుటకు ముందు రోజులోపు, దానిని నిల్వ ఉంచిన ప్రదేశము అనగా, పై పట్టికలో కనపరిచిన మండల స్థాయి గోదాముల నందు పరిశీలించుకొనుటకు అనుమతించబడును. 7) బహిరంగ వేలంలో ఎక్కువ వేలం పాడిన ట్రేడర్ / రైస్ మిల్లర్ వారు రవాణా మరియు హమాలి ఖర్చులను భరించి 13 మండల స్టాక్ పాయింట్ల నుండి బియ్యం తీసుకొనవలెను. 8) ఈ బహిరంగ వేలం అనేది జిల్లా సంయుక్త కలెక్టర్ వారి తుది నిర్ణయానికి లోబడి ఉండును.

వేలం జరుగు ప్రదేశం : జిల్లా సంయుక్త కలెక్టర్ కార్యాలయం
తేది : 18.03.2023, సమయం: ఉ॥ 10.00 గంటలకు
వివరాలకు జిల్లా పౌర సరఫరాల అధికారిని సంప్రదించవలెను: 8008301445

జాయింట్ కలెక్టర్ మరియు
ఈ.ఓ.ఈ.డి. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్
వై.యస్.ఆర్. జిల్లా.

గనులలో పనులు అడ్డుకున్న గ్రామస్తులు



గనులలోని ఖనిజ రవాణా వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ మంగంపేట గనులలో శుక్రవారం ఖనిజ రవాణాను గ్రామస్తులు, మహిళలు అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా పులపుత్తూరు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కాలుష్య గ్రామాలైన మంగంపేట, కాపుపల్లి, దళితవాడ గ్రామస్తుల తరలింపు జాప్యం కారణంగా ఖనిజ రవాణా వాహనాలను అడ్డుకున్నామని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల తరలింపునకు అన్ని రకాలుగా సహకరిస్తుంటే ఏపీఎండీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఐదు నెలలుగా పునరావాసం కోసం మూడు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. అనంతరం సీపీఓ వెంకటరమణ గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పులపుత్తూరు సుదర్శన్ రెడ్డి, కోటి, మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో నగరవనం

- జమ్మలమడుగు, బద్వేల్‌లో నగరవనాల కోసం ప్రతిపాదనలు
- జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఆహ్లాదకర వాతావరణంలో నగరవనాన్ని తీర్చుదిద్దుతామని జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులో ప్రారంభమైన నగరవనం పనులను శుక్రవారం సాయంత్రం డీఎఫ్‌ఓ పరిశీలించారు. అనంతరం రాజీవ్ నేషనల్ పార్కులో విలేకరులతో మాట్లాడారు. నగరవనం ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నగరవనంలో అన్ని వసతులు సమకూరాలంటే దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నగరవనం పనులను పూర్తి చేస్తామన్నారు. ప్రధాన ద్వారంలో ఏర్పాటు చేయాల్సిన ఆర్చీ గురించి అధికారులతో చర్చించారు. ప్రొద్దుటూరుతో పాటు జమ్మలమడుగు, బద్వేల్‌లో కూడా నగరవనాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభిస్తామని డీఎఫ్‌ఓ అన్నారు. తమకు నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో అతి తక్కువ వేతనంతో ఇబ్బందులు పడుతున్నట్లు నగరవనంలోని వీఎస్ఎస్ సభ్యులు డీఎఫ్‌ఓతో అన్నారు. వైపీయూ పాలక మండలి మాజీ సభ్యుడు రాజగోపాల్‌రెడ్డి డీఎఫ్‌ఓతో మాట్లాడారు. పార్కును మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాకింగ్‌కు వచ్చిన పలువురి అభిప్రాయాలను డీఎఫ్‌ఓ తెలుసుకున్నారు. పార్కులో చేయాల్సిన అభివృద్ధి గురించి వారితో చర్చించారు. రేంజర్ దినేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ లక్ష్మయ్య, ఎఫ్‌బీఓ శ్రీహరి పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : హజ్రత్ ఆయిషా బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. ఈ కళాశాలలో డిప్యూటీ సీఎం తన తండ్రిజ్ఞాపకార్థం రూ. 16 లక్షలతో రెండు తరగతి గదులను నిర్మించారు. ఈ తరగతి గదులను శుక్రవారం ప్రారంభించి కళాశాలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ మైనార్టీ బాలికల విద్యకోసం గత 30 సంవత్సరాలుగా పాటుపడుతోందన్నారు. ఈ కళాశాలను 60 మంది బాలికలతో ప్రారంభించారని, నేడు 12 వందల మంది బాలికలు ఇంటర్ విద్యనభ్యసించడం ఆనందదాయకంగా ఉందన్నారు. ముమ్ముందు డిగ్రీ కళాశాలగా ఈ సంస్థ ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అంజద్‌బాషా తల్లి నూర్జహాన్ బేగంతో పాటు సోదరులు, చెల్లెల్లు, బావలు, అల్లుడితోపాటు కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు. జూనియర్ కళాశాలకు రెండు తరగతి గదులను నిర్మించినందుకు కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ మజ్‌హర్ అలీఖాన్ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల కమిటీ సభ్యులు కలీముద్దీన్, యాసిన్‌బాషా, కరీముల్లా, అక్బర్‌బాషా, ఎస్‌బి అహమ్మద్ అలీ, ప్రిన్సిపాల్ హసీనాబేగం, కార్పొరేటర్లు అక్బర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సస్పెండైన వీఆర్‌ఏకు 24 వరకు రిమాండ్

గాలివీడు : అక్రమ వసూళ్ల పర్వంలో సస్పెండైన తాత్కాలిక వీఆర్‌ఏ కోలా రమణకు ఈనెల 24వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకటశివకుమార్ తెలిపారు. బాధితులు, రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోలీసులు నిందితున్ని శుక్రవారం లక్కిరెడ్డిపల్లి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసులో పూర్తి విచారణ చేసిన అనంతరం రూ. 23 లక్షలు వీఆర్‌ఏ వసూలు చేసినట్లు తేలిందన్నారు. అతని నుంచి రూ. 5 లక్షలు రికవరీ చేశామన్నారు.

ఒకరు లోపలికి... ఇద్దరు బయటకు!

- యువగళం పాదయాత్రలో మదనపల్లె టీడీపీ దుస్థితి
- అడుగడుగునా నాయకులు, కార్యకర్తలకు అవమానాలు, అలకలు
- ఇమేజ్ పెరగకపోగా, డ్యామేజీ జరిగిందంటున్న సీనియర్ నాయకులు




పాదయాత్రలో తనకు జరిగిన అవమానంపై ధర్నా చేసేందుకు వచ్చిన కమ్మల రఘునాథ్‌ను బుజ్జగిస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం సంగతమో కానీ... మదనపల్లె పర్యటన మాత్రం ఆయనకు లేనిపోని తలనొప్పులు తెచ్చిపెడుతోంది. పార్టీలోకి కొత్తగా మైనారిటీ నాయకుడు వస్తున్నాడని సంబరపడేలోపు.. ప్రజాబలం ఉన్న ఓ సీనియర్ నాయకుడిని, ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న మరో ఆశావహుడిని పార్టీపై అలకపూని వెళ్లిపోయేలా చేసింది. పాదయాత్రలో పార్టీని బలోపేతం చేసి, నాయకులందరి మధ్య సఖ్యత తీసుకువచ్చి గాలి తగ్గిపోయిన సైకిల్‌ను పరుగులు తీయిస్తాడనుకుంటే ఏకంగా చక్రాలే లేకుండా చేసి వెళ్లిపోతున్నాడని సీనియర్ నాయకులు వాపోతున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభం రోజున టీడీపీ ఆశావహుడు జయరామనాయుడు ఘోర పరాభవంతో అలిగి ఇంటికి వెళ్లిపోతే.. రెండోరోజు శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శోభ భర్త రాటకొండ బాబురెడ్డి మనస్థాపంతో పాదయాత్రలో పాల్గొనకుండా వెళ్లిపోయారు. ఉదయం పట్టణంలో దేవతానగర్ క్యాంప్‌సైట్ వద్ద ఇన్‌చార్జి దొమ్మలపాటిరమేష్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ భవానీప్రసాద్ కుటుంబ సభ్యులు నారాలోకేష్‌ను కలిసేందుకు లోపలికి వెళ్లారు. అప్పుడే అక్కడికి చేరుకున్న సీనియర్ నాయకుడు రాటకొండ బాబురెడ్డి కురబ కులానికి చెందిన ప్రతినిధులు వినతిపత్రం ఇవ్వాలంటే వారిని తీసుకు ని లోపలికి వెళ్లేందుకు వచ్చారు. దొమ్మలపాటిరమేష్, కుటుం బసభ్యులను లోపలకు పంపిన సెక్యూరిటీ సిబ్బంది బాబురెడ్డిని లోపలకు పంపేందుకు ససేమిరా కుదరదన్నారు. తాను సీనియర్ నాయకుడినని చెప్పినా వినకపోవడంతో ఆయన ఒకింత అసహనానికి, మనస్థాపానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి సముదాయించేందుకు ప్రయత్నిస్తే.. మీ వెనుక తిరిగితేనే మమ్మల్ని లీడర్లుగా గుర్తిస్తారా లేకపోతే గుర్తించరా.. అంటూ అక్కడి నుంచి వచ్చేశారు. ఇదిలాఉంటే మదనపల్లె పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు కమ్మల రఘునాథ్ నారాలోకేష్‌ను గజమాలతో సత్కరించాలని, పెద్ద క్రేన్‌ను తెప్పించి అనిబిసెంట్ సర్కిల్‌లో గంపెడాశతో నిలబడితే.. నారా లోకేష్ గజమాలను స్వీకరించకపోగా, కలిసేందుకు వచ్చిన ఆయన ను నెట్టివేశాడు. ఒకవేళ ఆయనకు తానెవరో తెలియక నెట్టేశారేమోనని అనుకున్నా.. ఆయన పక్కనే ఉన్న ఇన్‌చార్జి దొమ్మలపాటిరమేష్ కుమారులు ఇద్దరూ పట్టించుకోకపోవడం, మాటవరుసకైనా మనవాడేనని చెప్పకపోవడంతో రఘునాథ్ అవమానానికి లోనయ్యాడు. ఆగ్రహంతో రగిలిపోతూ సుమారు 100మంది యువకులతో కలిసి లోకేష్ విడిది కేంద్రం వద్ద ధర్నా చేసేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న పార్టీ పెద్దలు వారించడంతో లోలోపలే దుఃఖాన్ని దిగమింగుకుని ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. పాదయాత్రలో పాల్గొన్న సగం మందికి భోజనాలు పెట్టకపోవడంతో విడిది కేంద్రం నుంచి వెళ్లిపోయారు. దీంతో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన బహిరంగ సభ 1.30 గంట ఆలస్యంగా జనాలను బలవంతంగా తీసుకువచ్చి సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభించారు.


అమ్మా రండి..అన్నతో సెల్ఫీలు తీసుకోండి

లోకేష్‌తో ఫొటో తీయించుకోవాలంటూ మహిళలను అభ్యర్థించిన యువగళం టీం



సెల్ఫీలకు రండక్కా.. అని బతిమాలి తీసుకెళుతున్న యువగళం టీంసభ్యుడు రాకేష్

మదనపల్లె : నారాలోకేష్ యువగళం పాదయాత్రను ఎలాగైనా విజయవంతం చేసేందుకు టీం సభ్యులు తెగ కష్టపడిపోతున్నారు. లోకేష్‌ను చూసేందుకు ప్రజలు రాకపోయినా, రోడ్డుపై ప్రజలు కనిపించకపోయినా వాళ్లు ఎక్కడుంటే అక్కడకు వెళ్లి.. 'అమ్మా రండమ్మా.. రండి.. అన్నతో సెల్ఫీలు తీసుకోండి. ప్లీజ్.. మహిళలకు మాత్రమే అవకాశం' అంటూ బతిమాలి, బామాలి.. వారికిష్టం లేకున్నా బలవంతంగా సెల్ఫీలు తీయించి పంపుతున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో శుక్రవారం నిర్వహించిన యువగళం పాదయాత్రలో నారాలోకేష్ టీంసభ్యులు రాకేష్ రోప్‌వేకు ముందు వెళుతూ మహిళలు, ప్రజలను ఇలా అభ్యర్థించడం కనిపించింది. కొందరైతే మాకెందుకయ్యా ఆ బాబుతో సెల్ఫీ అంటున్నా వినకుండా.. రండక్కా అంటూ వేడుకోవడం కనిపించింది.



రాకేష్ తీసుకువచ్చిన మహిళలతో సెల్ఫీ దిగుతున్న నారాలోకేష్

సాక్షి బిజినెస్

శనివారం
11-3-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▽	671	59,135
నిఫ్టీ ▽	177	17,413

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్‌	11,233	▽ 105
డోజోన్స్‌	32,093	▽ 161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,748	▽ 132
డాక్స్‌	15,428	▽ 205
షాంఘై	3,230	▽ 46
నికాయ్‌	28,144	▽ 479

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారట్‌)	55,669	△ 383
బంగారం (22 క్యారట్‌)	55,446	△ 381
వెండి (కిలో)	61,791	▽ 2

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	81.38	83.05
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	96.38	99.64
€	యూరో	ఒకటి	85.60	88.64
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఒకటి	59.23	61.15
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	52.93	55.28
S$	సింగపూర్‌ డాలర్‌	ఒకటి	59.68	61.62
SAR	సౌదీ రియాల్‌	[illegible]	20.88	22.55
UAE D	యూఏఈ దిర్హామ్‌	[illegible]	21.44	23.23
¥	చైనా యువాన్‌	[illegible]	10.69	12.76

హెచ్‌యూఎల్‌ ఎండీగా రోహిత్‌ జావా

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్‌ యూనిలీవర్‌ లిమిటెడ్‌ (హెచ్‌యూఎల్‌) నూతన ఎండీ, సీఈవోగా రోహిత్‌ జావా నియమితులయ్యారు. దశాబ్ద కాలంపాటు నాయకత్వం వహించి పదవీ



విరమణ చెందుతున్న సంజీవ్‌ మెహతా స్థానాన్ని ఆయన భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం లండన్‌లో యూనిలీవర్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌ చీఫ్‌గా జావా ఉన్నారు. అయిదేళ్ల కాలానికిగాను ఎండీ, సీఈవోగా 2023 జూన్‌ 27న బాధ్యతలు స్వీకరిస్తారు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్‌ 1న కంపెనీ శాశ్వత డైరెక్టర్‌గా హెచ్‌యూఎల్‌ బోర్డులో చేరనున్నారు. యూనిలీవర్‌ సౌత్‌ ఏషియా ప్రెసిడెంట్‌గానూ ఆసీనులు కానున్నారు.

సెమీకండక్టర్ల రంగంలో మరింత సహకారం

భారత్‌, అమెరికా మధ్య ఎంవోయూ



సంయుక్త విలేకరుల సమావేశంలో భారత్‌ అమెరికా వాణిజ్య మంత్రులు

న్యూఢిల్లీ: సెమీకండక్టర్ల రంగంలో సహకారాన్ని మరింత పెంచుకునే దిశగా భారత్‌, అమెరికా శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. భారత్‌–అమెరికా వాణిజ్య చర్చల్లో భాగంగా కుదుర్చుకున్న ఈ ఒప్పందం.. సెమీకండక్టర్ల సరఫరా వ్యవస్థ ఏర్పాటు, ఆవిష్కరణల అంశాల్లో కలిసి పనిచేసేందుకు తోడ్పడనుంది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత ఈ చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులపరమైన సంబంధాలను మెరుగుపర్చుకునే మార్గాలపై ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌ గోయల్‌, అమెరికా వాణిజ్య మంత్రి జినా రైమొండో చర్చించారు. ఎలక్ట్రానిక్స్‌ సరఫరా వ్యవస్థలో కీలకంగా ఎదగాలన్న భారత్‌ ఆకాంక్షలకు ఈ ఎంవోయూ ద్వారా తోడ్పాటు లభించగలదని అమెరికా భావిస్తున్నట్లు రైమొండో తెలిపారు. పటిష్టమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు, పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని గోయల్‌ వివరించారు.

పారిశ్రామిక ఉత్పత్తి ఓకే!

- జనవరిలో ఐఐపీ 5.2 శాతం అప్‌
- విద్యుత్‌, తయారీలు బాగున్నాయ్‌

న్యూఢిల్లీ: భారత్‌ పారిశ్రామిక ఉత్పత్తి 2023 జనవరిలో మంచి పనితీరును కనబరిచింది. ఇందుకు సంబంధించిన సూచీ (ఐఐపీ) 5.2



శాతం పెరిగింది. 2022 డిసెంబర్‌లో సూచీ పెరుగుదల రేటు 4.7 శాతంగా ఉంది. ఇక 2022 జనవరిలో ఐఐపీ వృద్ధి రేటు కేవలం 2 శాతం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం విద్యుత్‌, తయారీ రంగాలు చక్కటి పనితీరును ప్రదర్శించాయి.

రంగాల వారీగా ఉత్పత్తి గణాంకాలు (శాతాల్లో)

	2023 జనవరి	2022 డిసెంబర్‌
తయారీ	3.7	2.6
మైనింగ్‌	8.8	9.8
విద్యుత్‌	12.7	10.4
క్యాపిటల్‌ గూడ్స్‌	11.0	7.6
కన్జూమర్‌ డ్యూరబుల్స్‌	- 7.5	- 10.4
కన్జూమర్‌ నాన్‌ డ్యూరబుల్స్‌	6.2	7.2
ఇన్‌ఫ్రా/నిర్మాణం	8.1	8.2
ప్రైమరీ గూడ్స్‌	- 9.6	8.3
ఇంటర్మీడియట్‌ గూడ్స్‌	-0.1	-0.3

ఏప్రిల్‌ నుంచి జనవరి వరకూ ఆర్థిక సంవత్సరం 10 నెలల కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 5.4 శాతంకాగా, 2021-22 ఇదే కాలంలో ఈ రేటు 13.7 శాతం.

అంబుజాలో అదానీ 4.5 శాతం వాటాల విక్రయం

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా గ్రూప్‌ రుణభారాన్ని తగ్గించుకోవడంపై అదానీ గ్రూప్‌ చీఫ్‌ గౌతమ్‌ అదానీ దృష్టి పెడుతున్నారు. ఇందులో భాగంగా అంబుజా సిమెంట్స్‌లో 4.5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని విలువ సుమారు 450 మిలియన్‌ డాలర్లుగా (దాదాపు రూ.3,380) ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.



ఇందుకు సంబంధించి ఆర్థిక సంస్థలను కూడా సంప్రదించినట్లు పేర్కొన్నాయి. గతేడాది కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్‌లో అదానీకి 63 శాతం వాటాలు ఉన్నాయి. ప్రస్తుతం అదానీ గ్రూప్‌ రుణ భారం దాదాపు 24 బిలియన్‌ డాలర్ల స్థాయిలో ఉంది. ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికన్‌ షార్ట్‌ సెల్లింగ్‌ సంస్థ హిండెన్‌బర్గ్‌ రీసెర్చ్‌ ఆరోపణలతో గ్రూప్‌ కంపెనీల షేర్లు ఇటీవల భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అయితే, మళ్లీ కొన్ని క్రమంగా కోలుకుంటున్నాయి.

ఐపీవోకు టాటా టెక్నాలజీస్‌

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కార్పొరేట్‌ దిగ్గజం టాటా గ్రూప్‌ నుంచి మరో కంపెనీ పబ్లిక్‌ ఇష్యూ బాట పట్టింది. గ్లోబల్‌ ఇంజినీరింగ్‌ సర్వీసెస్‌ అందించే టాటా టెక్నాలజీస్‌ ఐపీవో సన్నాహాలు ప్రారంభించింది. సెబీకి తాజాగా



ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్‌కు ఇది అనుబంధ సంస్థకాగా.. ఇంతక్రితం ఐటీ సేవల నంబర్‌ వన్‌ కంపెనీ టీసీఎస్‌ 2004లో స్టాక్‌ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. ఐపీవోలో భాగంగా టాటా టెక్నాలజీస్‌ 9.57 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది.

గ్లోబల్‌ సర్ఫేసెస్‌ @ రూ. 133-140

నేచురల్‌ స్టోన్స్‌ ప్రాసెసింగ్‌, ఇంజినీర్డ్‌ క్వార్ట్జ్‌ తయారీ కంపెనీ గ్లోబల్‌ సర్ఫేసెస్‌ లిమిటెడ్‌ పబ్లిక్‌ ఇష్యూ సోమవారం(13న) ప్రారంభం



కానుంది. బుధవారం (15న) ముగియనున్న ఇష్యూకి షేరుకి రూ. 133–140 ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించింది. తద్వారా రూ. 155 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఐపీవోలో భాగంగా 85.2 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుంది.

మార్కెట్లకు గ్లోబల్‌ షాక్‌



- రెండో రోజూ భారీ అమ్మకాలు
- సెన్సెక్స్‌ 671 పాయింట్లు డౌన్‌
- 59,135 వద్ద ముగింపు
- 177 నష్టంతో 17,413కు నిఫ్టీ

ముంబై: యూఎస్‌కు చెందిన ఎస్‌వీబీ ఫైనాన్షియల్‌ గ్రూప్‌ నిధుల సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో ప్రపంచవ్యాప్తంగా సెంటిమెంటుకు దెబ్బ తగిలింది. దీంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్‌ మార్కెట్లు పతనమయ్యాయి. సెన్సెక్స్‌ 671 పాయింట్లు కోల్పోయి 59,135 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 177 పాయింట్లు క్షీణించి 17,413 వద్ద నిలిచింది. రోజంతా అమ్మకాలదే పైచేయి కావడంతో మార్కెట్లు నష్టాల మధ్యే కదిలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్‌ 58,885ను తాకింది. ఒక్క రోజులోనే బీఎస్‌ఈ మార్కెట్‌ విలువలో రూ. 1.36 లక్షల కోట్లు ఆవిరైంది. రూ. 2,62,94,724 కోట్లకు చేరింది.

బ్యాంకింగ్‌కు దెబ్బ

అంచనాలకు మించి వడ్డీ రేట్లు పెరగవచ్చన్న యూఎస్‌ ఫెడ్‌ చైర్మన్‌ పావెల్‌ వ్యాఖ్యలు, ఎస్‌వీబీ ఫైనాన్షియల్‌ గ్రూప్‌పై ఆందోళనలు ఇన్వెస్టర్లలో భయాలకు కారణమయ్యాయి. దీంతో దేశీయంగా బ్యాంకింగ్‌ స్టాక్స్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. ఎన్‌ఎస్‌ఈలో బ్యాంకింగ్‌, మీడియా, రియల్టీ, మెటల్‌, ఐటీ 2–1 శాతం నీరసించాయి. ఎఫ్‌ఎంసీజీ, కన్జూమర్‌ డ్యురబుల్స్‌ స్వల్పంగా బలపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, అపోలో హాస్పిటల్స్‌, ఇండస్‌ఇండ్‌, ఎస్‌బీఐ, యాక్సిస్‌, బజాజ్‌ ఫిన్‌, ఎంఅండ్‌ఎం, ఐసీఐసీఐ, ఎల్‌అండ్‌టీఆర్‌ఐఎల్‌, కొటక్‌ బ్యాంక్‌ 3–1 శాతం మధ్య క్షీణించాయి. టాటా మోటార్స్‌, ఎన్‌టీపీసీ, మారుతీ, బ్రిటానియా, పవర్‌గ్రిడ్‌, టైటన్‌ 1–0.4 శాతం మధ్య బలపడ్డాయి.

మూతబడిన సిలికాన్‌ వ్యాలీ బ్యాంక్‌

న్యూయార్క్‌: ఇన్సూర్డ్‌ డిపాజిట్ల రక్షణకు వీలుగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సిలికాన్‌ వ్యాలీ బ్యాంక్‌(ఎస్‌వీబీ)ని మూసివేసినట్లు కాలిఫోర్నియా ఆర్థిక పరిరక్షణ శాఖ పేర్కొంది. అంతేకాకుండా ఫైనాన్షియల్‌ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఐసీ చేతికి అప్పగించినట్లు శుక్రవారం వెల్లడించింది. ప్రధానంగా సిలికాన్‌ వ్యాలీ, టెక్‌ స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే ఎస్‌వీబీ ఫైనాన్షియల్‌ గ్రూప్‌ ఆర్థిక సంక్షోభంలో పడింది. బ్యాంక్‌ పోర్ట్‌ఫోలియోలో భారీ నష్టాలు నమోదుకావడంతో నిధుల సమీకరణకు తెరతీసింది. బాండ్ల పోర్ట్‌ఫోలియోలో నష్టాలు నమోదు చేస్తున్న 21 బిలియన్‌ డాలర్ల(సుమారు రూ. 1,72,000 కోట్లు) విలువైన బాండ్లను విక్రయించినట్లు ఎస్‌వీబీ వెల్లడించింది. దీంతో 1.8 బిలియన్‌ డాలర్ల చిల్లు పడినట్లు తెలియజేసింది. ఫలితంగా బ్యాలన్స్‌షీట్‌ పటిష్టత కోసం 2.25 బిలియన్‌ డాలర్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో నికర వడ్డీ ఆదాయం భారీగా క్షీణించవచ్చని బ్యాంక్‌ అంచనా వేసింది. యూఎస్‌ వెంచర్‌ క్యాపిటల్‌(వీసీ) దన్నున్న మొత్తం స్టార్టప్‌లలో సగానికిపైగా ఎస్‌వీబీ ఫైనాన్షియల్‌ సేవలందిస్తోంది. కస్టమర్లలో గతేడాది ఐపీవోకు వెళ్లిన 44 శాతం టెక్‌, హెల్త్‌కేర్‌ కంపెనీలుండటం గమనార్హం! జాబితాలో పింటెరెస్ట్‌ ఇంక్‌, షాపిఫై ఇంక్‌, సైబర్‌ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్‌ హోల్డింగ్స్‌ తదితరాలున్నాయి. వెరసి పలు వీసీ సంస్థలు ఎస్‌వీబీతో పోర్ట్‌ఫోలియో బిజినెస్‌లను తగ్గించుకోవడంతోపాటు నగదును వెనక్కి తీసుకునే యోచనలో పడినట్లు తెలుస్తోంది. దీంతో బ్యాంక్‌పట్ల విశ్వాసం ఉంచవలసిందిగా క్లయింట్లు, వీసీ ఇన్వెస్టర్లను ఎస్‌వీబీ సీఈవో గ్రెగ్‌ బెకర్‌ అభ్యర్థించారు.

బ్యాంక్‌ షేర్లకు సెగ

ఎస్‌వీబీ ఆర్థిక సంక్షోభ ఆందోళనలకుతోడు సిల్వర్‌గేట్‌ క్యాపిటల్‌ కార్ప్‌ మూతపడటంతో ఇన్వెస్టర్లలో భయాలు అధికమయ్యాయి. ఇటీవలే ఫెడ్‌ చైర్మన్‌ పావెల్‌ వడ్డీ రేట్ల పెంపు సంకేతాలివ్వడం దీనికి జత కలిసింది. ఫలితంగా గురువారం కేబీడబ్ల్యూ బ్యాంక్‌ ఇండెక్స్‌ 8% కుప్పకూలింది. యూఎస్‌ దిగ్గజాలు బ్యాంక్‌ ఆఫ్‌ అమెరికా, వెల్స్‌ ఫార్గో, జేపీ మోర్గాన్‌ షేర్లు 5%స్థాయిలో పతనమయ్యాయి.

కనెక్ట్‌ స్మార్ట్‌ సన్‌గ్లాసెస్‌

హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో: కన్జూమర్‌ ఎలక్ట్రానిక్స్‌ కంపెనీ కనెక్ట్‌ గ్యాడ్జెట్స్‌ రిథమ్‌ పేరుతో బ్లూటూత్‌ కాలింగ్‌ స్మార్ట్‌ సన్‌గ్లాసెస్‌ను ఆవిష్కరించింది.



ఎండ నుంచి రక్షణతోపాటు ఫోన్‌ కాల్స్‌ అందుకోవచ్చు. పాటలు వినొచ్చు. స్పెషల్‌ లాంచ్‌ ఆఫర్‌ ధర రూ. 1,999. నాలుగు గంటల ప్లేబ్యాక్‌ టైమ్‌ అందిస్తుంది. మార్కెట్లోకి విడుదల చేసిన 3 రోజుల్లోనే 20,000 యూనిట్లు విక్రయించామని కంపెనీ కో–ఫౌండర్‌ ప్రదీప్‌ యెర్రగుంట్ల తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

11-3-2023	
విశాఖ	430-00
చిత్తూరు	458-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	423-00
విజయవాడ	423-00
రిటైల్‌ ధర (డజను)	66.00
10-3-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	415-00
వరంగల్‌	417-00
రిటైల్‌ ధర	4.75

సాక్షి స్పోర్ట్స్‌

జర్మనీపై భారత్‌ విజయం

ఎఫ్‌ఐహెచ్‌ ప్రొ లీగ్‌ హాకీ టోర్నీలో భారత్‌ ఖాతాలో కీలక గెలుపు చేరింది. రూర్కెలాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్‌ 3–2 గోల్స్‌ తేడాతో ప్రపంచ చాంపియన్‌ జర్మనీపై సంచలన విజయం సాధించింది. భారత్‌ తరఫున హర్మన్‌ప్రీత్‌ సింగ్‌ (30వ నిమిషం) పెనాల్టీ కార్నర్‌ ద్వారా గోల్‌ సాధించగా... సుఖ్‌జీత్‌ సింగ్‌ రెండు ఫీల్డ్‌ గోల్స్‌ (31వ ని., 42వ ని.) నమోదు చేశాడు. జర్మనీ నుంచి రెండూ ఫీల్డ్‌ గోల్స్‌ వచ్చాయి. 44వ నిమిషంలో కాఫ్‌మన్‌ పాల్‌ ఫిలిప్‌, 57వ నిమిషంలో స్ట్రతఆఫ్‌ మైకేల్‌ గోల్స్‌ కొట్టారు. మూడో క్వార్టర్‌ ముగిసే సరికి భారత్‌ 3–1తో ఆధిక్యంలో నిలిచినా... చివరి క్వార్టర్‌లో జర్మనీ గోల్‌ చేసి ఆధిక్యాన్ని తగ్గించగలిగింది. తమకు లభించిన ఏకైక పెనాల్టీని భారత్‌ సద్వినియోగం చేసుకోగలిగింది. భారత్‌ తమ తర్వాతి పోరులో ఆదివారం ఆస్ట్రేలియాతో తలపడుతుంది.



మన బ్యాటర్లపైనే భారం



అశ్విన్‌

భారత్‌, ఆస్ట్రేలియా ఆఖరి టెస్టు పరుగుల బాట పట్టింది. గ్రీన్‌ శతకం సహాయంతో కంగారూలు భారీ స్కోరు నమోదు చేశారు. ఒక ఇన్నింగ్స్‌లో రెండు శతకాలు రావడం ఈ సిరీస్‌లో ఇదే మొదటిసారి. ఇక మన జట్టు ఎన్ని పరుగులు సాధిస్తుందనేది ఆసక్తికరం. ఆడిన పది ఓవర్లలో చక్కటి షాట్లతో ఎలాంటి ప్రమాదం లేకుండా రెండో రోజును ముగించిన టీమిండియా... మూడో రోజూ బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై చెలరేగాల్సి ఉంది.

- తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌ 36/0
- ఆస్ట్రేలియా 480 ఆలౌట్‌
- కామెరాన్‌ గ్రీన్‌ సెంచరీ

అహ్మదాబాద్‌: ఈ సిరీస్‌లో స్పిన్‌ మాయలో, వికెట్ల వేటలో విజయవంతమైన బౌలర్లకు చివరి టెస్టు కఠినమైన సవాల్‌ విసురుతోంది. బ్యాటర్లకు స్వర్గధామంగా కనిపించిన మోదీ మైదానంలో రెండో రోజూ పరుగుల జోరు కొనసాగింది. అశ్విన్‌ (6/91) ఆరు వికెట్లతో ఆకట్టుకోగా... అప్పటికే పర్యాటక ఆసీస్‌ భారీ స్కోరు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 167.2 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆలౌటైంది. ఉస్మాన్‌ ఖాజా (422 బంతుల్లో 180; 21 ఫోర్లు) డబుల్‌ సెంచరీ అవకాశం కోల్పోగా, కామెరాన్‌ గ్రీన్‌ (170 బంతుల్లో 114; 18 ఫోర్లు) టెస్టు కెరీర్‌లో తొలి శతకం బాదాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ ఆరంభించిన భారత్‌ పది ఓవర్లు ఆడి వికెట్‌ కోల్పోకుండా 36 పరుగులు చేసింది. కెప్టెన్‌ రోహిత్‌ శర్మ (17 బ్యాటింగ్‌; 2 ఫోర్లు), శుబ్‌మన్‌ గిల్‌ (18 బ్యాటింగ్‌; 1 ఫోర్‌, 1 సిక్స్‌) క్రీజులో ఉన్నారు.

ద్విశతక భాగస్వామ్యం...

రెండో రోజు తొలి సెషన్‌లో కూడా ఆస్ట్రేలియా ఆధిపత్యమే కొనసాగింది. 255/4 ఓవర్‌నైట్‌ స్కోరుతో ఆట కొనసాగించిన ఉస్మాన్‌ ఖాజా– గ్రీన్‌ జోడీ భారత బౌలింగ్‌పై పైచేయి సాధించింది. దీంతో జట్టు స్కోరు 300 పరుగులు దాటింది. లంచ్‌ బ్రేక్‌కు ముందే ఖాజా 150 మార్క్‌ను దాటగా, గ్రీన్‌ సెంచరీకి 5 పరుగుల దూరంలో నిలిచాడు. 347/4 స్కోరు వద్ద తొలి సెషన్‌ ముగియగా, రెండో సెషన్‌ మొదలైన కాసేపటికే గ్రీన్‌ టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీని సాధించాడు. ఐదో వికెట్‌కు ఉస్మాన్‌ ఖాజా, గ్రీన్‌ 208 పరుగులు జోడించారు. 1979 తర్వాత భారత్‌ గడ్డపై ఆస్ట్రేలియా జోడీ నమోదు చేసిన ద్విశతక భాగస్వామ్యం ఇదే! ఆతిథ్య జట్టును అష్టకష్టాలు పెట్టిన ఈ జోడీని ఎట్టకేలకు అశ్విన్‌ విడగొట్టాడు. గ్రీన్‌ను అవుట్‌ చేయడంతో భారీ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్‌ ఆఖరి బంతికి క్యారీ (0)ని కూడా పెవిలియన్‌ చేర్చాడు. స్వల్ప వ్యవధిలో స్టార్క్‌ (6)ను అశ్విన్‌ బోల్తా కొట్టించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఈ పర్యటనలో తొలిసారి 400 పరుగుల మైలురాయిని చేరుకోగా, 409/7 వద్ద టీ విరామానికి వెళ్లారు.

విసిగించిన మర్ఫీ, లయన్‌

ఆఖరి సెషన్లో డబుల్‌ సెంచరీ దిశగా సాగుతున్న ఖాజాకు అక్షర్‌ పటేల్‌ చెక్‌ పెట్టాడు. ఇంకేం మిగతా రెండు వికెట్లను కూల్చేయడం సులభమే అనుకున్న భారత్‌కు టెయిలెండర్లు టాడ్‌ మర్ఫీ (61 బంతుల్లో 41; 5 ఫోర్లు), లయన్‌ (96 బంతుల్లో 34; 6 ఫోర్లు) చెమటలు పట్టించారు. ఇద్దరు 19.2 ఓవర్లు ఆడటంతో ఆతిథ్య బౌలర్లు శ్రమించక తప్పలేదు. బ్యాటింగ్‌కు కలిసొచ్చిన పిచ్‌పై ఈ స్పెషలిస్టు బౌలర్లు చక్కగా బ్యాటింగ్‌ చేశారు. వీలుచిక్కిన బంతిని బౌండరీలకు తరలించారు. ఇక ఒక దశలో 500 పరుగులు దాటిస్తారనిపించింది. వీరిద్దరు తొమ్మిదో వికెట్‌కు 70 పరుగులు జోడించారు. అయితే అశ్విన్‌ వరుస ఓవర్లలో మర్ఫీ, లయన్‌ను అవుట్‌ చేయడంతో ఆసీస్‌ ఆలౌటైంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌: హెడ్‌ (సి) జడేజా (బి) అశ్విన్‌ 32; ఖాజా (ఎల్బీ) (బి) అక్షర్‌ 180; లబుషేన్‌ (బి) షమీ 3; స్మిత్‌ (బి) జడేజా 38; హ్యాండ్స్‌కాంబ్‌ (బి) షమీ 17; గ్రీన్‌ (సి) భరత్‌ (బి) అశ్విన్‌ 114; క్యారీ (సి) అక్షర్‌ (బి) అశ్విన్‌ 0; స్టార్క్‌ (సి) అయ్యర్‌ (బి) అశ్విన్‌ 6; లయన్‌ (సి) కోహ్లి (బి) అశ్విన్‌ 34; మర్ఫీ (ఎల్బీ) (బి) అశ్విన్‌ 41; కునెమన్‌ నాటౌట్‌ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (167.2 ఓవర్లలో ఆలౌట్‌) 480. వికెట్ల పతనం:** 1-61, 2-72, 3-151, 4-170, 5-378, 6-378, 7-387, 8-409, 9-479, 10-480. **బౌలింగ్‌:** షమీ 31-3-134-2, ఉమేశ్‌ 25-2-105-0, అశ్విన్‌ 47.2-15-91-6, జడేజా 35-5-89-1, అక్షర్‌ 28-8-47-1, అయ్యర్‌ 1-0-2-0.

భారత్‌ తొలి ఇన్నింగ్స్‌: రోహిత్‌ బ్యాటింగ్‌ 17; గిల్‌ బ్యాటింగ్‌ 18; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (10 ఓవర్లలో వికెట్‌ నష్టపోకుండా) 36. బౌలింగ్‌:** స్టార్క్‌ 3-1-7-0, గ్రీన్‌ 2-0-11-0, లయన్‌ 3-0-14-0, కునెమన్‌ 2-0-3-0.

611 ఖాజా బ్యాటింగ్‌ చేసిన నిమిషాలు. భారత్‌లో ఒక ఆసీస్‌ బ్యాటర్‌ సుదీర్ఘ ఇన్నింగ్స్‌ ఇదే. ఆసీస్‌ తరఫున బంతులపరంగా (422) కూడా ఖాజాదే రికార్డు. గతంలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు (యూనిస్‌ఖాన్‌, ఆమ్లా, జయవర్ధనే) మాత్రమే భారత్‌లో 10 గంటలకు పైగా బ్యాటింగ్‌ చేయగలిగారు.

32 ఇన్నింగ్స్‌లో అశ్విన్‌ 5 వికెట్లు పడగొట్టడం ఇది 32వ సారి. భారత గడ్డపై కుంబ్లే (25 సార్లు) పేరిట ఉన్న రికార్డును అతను (26) అధిగమించాడు. ఆసీస్‌పై అత్యధిక వికెట్లు (113) తీసిన భారత బౌలర్‌గా కూడా కుంబ్లే (111) రికార్డును అశ్విన్‌ సవరించాడు.



గ్రీన్‌

కమిన్స్‌ ఇంట్లో విషాదం

సిడ్నీ: ఆస్ట్రేలియా టీమ్‌ రెగ్యులర్‌ కెప్టెన్‌ ప్యాట్‌ కమిన్స్‌ తల్లి మారియా కన్నుమూసింది. చాలా ఏళ్లుగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. అయితే రెండు వారాల క్రితం మారియా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. దాంతో తల్లిని చూసుకునేందుకు కమిన్స్‌ భారత్‌తో రెండో టెస్టు ముగిసిన తర్వాత స్వదేశం తిరిగి వెళ్లాడు. ఆమె కోలుకోకపోవడంతో అక్కడే ఉండిపోయాడు. మారియా మృతి పట్ల ఇరు దేశాల క్రికెట్‌ బోర్డులు సంతాపం ప్రకటించగా...ఆస్ట్రేలియా క్రికెటర్లు సంతాపసూచకంగా శుక్రవారం భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి మైదానంలోకి దిగారు.

బెంగళూరుకు నాలుగో ఓటమి

- 10 వికెట్లతో యూపీ జయభేరి
- చెలరేగిన ఎకిల్‌స్టోన్‌, హీలీ
- డబ్ల్యూపీఎల్‌

ముంబై: మహిళల ప్రీమియర్‌ లీగ్‌లో రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇంకా బోణీకొట్టని బెంగళూరు వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. శుక్రవారం జరిగిన పోరులో అలీసా హీలీ (47 బంతుల్లో 96 నాటౌట్‌; 18 ఫోర్లు, 1 సిక్స్‌) బౌండరీల విధ్వంసంతో యూపీ వారియర్స్‌ 10 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. మొదట బ్యాటింగ్‌ చేపట్టిన బెంగళూరు 19.3 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్‌ స్మృతి మంధాన (4) నిరాశపర్చగా, సోఫీ డివైన్‌ (24 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్‌), ఎలైస్‌ పెర్రీ (39 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్‌) ధాటిగా ఆడారు. వీళ్లిద్దరు రెండో వికెట్‌కు 44 పరుగులు జత చేశారు. అయితే జట్టు స్కోరు 73 పరుగుల వద్ద సోఫీ అవుటయ్యాక పరిస్థితి మారింది. పెర్రీ క్రీజులో ఉన్నప్పటికీ అవతలి వైపు నిలబడే బ్యాటరే కరువయ్యారు. కనిక (8), హీథెర్‌ నైట్‌ (2), శ్రేయాంక (15), బరేస్స్‌ (12) ఇలా అంతా మూకుమ్మడిగా విఫలమయ్యారు. వారియర్స్‌ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్‌ 4, దీప్తి శర్మ 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన యూపీ 13 ఓవర్లలోనే వికెట్‌ నష్టపోకుండా 139 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్‌, కెప్టెన్‌ అలీసా హీలీ, దేవిక వైద్య (31 బంతుల్లో 36 నాటౌట్‌; 5 ఫోర్లు) ఇంకా 7 ఓవర్లు మిగిలుండగానే అజేయంగా ముగించారు.



హీలీ



ఎకిల్‌స్టోన్‌

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్‌ జెయింట్స్‌ X ఢిల్లీ క్యాపిటల్స్‌

రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్‌ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూజిలాండ్‌ 162/5

క్రైస్ట్‌చర్చ్‌: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్‌ కష్టాల్లో పడింది. మ్యాచ్‌ రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్‌ తమ తొలి ఇన్నింగ్స్‌ 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. టామ్‌ లాథమ్‌ (67) అర్ధ సెంచరీ సాధించగా... డరైల్‌ మిచెల్‌ (40 బ్యాటింగ్‌), కాన్వే (30) రాణించారు. కుమార, అసిత చెరో 2 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఓవర్‌నైట్‌ స్కోరు 305/6తో ఆట కొనసాగించిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 355 పరుగులకు ఆలౌటైంది. సౌతీ 5, హెన్రీ 4 వికెట్లు తీశారు. ప్రస్తుతం కివీస్‌ మరో 193 పరుగులు వెనుకబడి ఉంది.

దక్షిణాఫ్రికా 287/7

జొహన్నెస్‌బర్గ్‌: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. కెప్టెన్‌ తెంబా బవుమా (275 బంతుల్లో 171 బ్యాటింగ్‌; 20 ఫోర్లు) భారీ సెంచరీతో చెలరేగగా...ముల్డర్‌ (42) రాణించాడు. 8 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన సఫారీ టీమ్‌ను బవుమా ఒంటి చేత్తో ఆదుకున్నాడు. బవుమా, ముల్డర్‌ ఆరో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. విండీస్‌ బౌలర్లలో మేయర్స్‌, అల్జారి జోసెఫ్‌ చెరో 2 వికెట్లు తీశారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా ఓవరాల్‌గా 356 పరుగుల ఆధిక్యంలో ఉంది.